بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ      نَحۡمَدُهٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِهِ الۡکَرِیۡمِ      وَعَلٰی عَبۡدِهِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 16.01.2026 (Telugu)**

# దేవుని పట్ల హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు గల ప్రేమ గురించి విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 16.01.2026 తేదీన - మస్జిద్ ఇస్లామాబాద్, టిల్ఫోర్డ్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَا إِلَهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ. بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ. اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ. الرَّحْمٰنِ الرَّحِيْمِ. مٰلِكِ يَوْمِ الدِّيْنِ. إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ. اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ. صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ.

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. నేను గత ఖుత్బా ప్రసంగంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర మరియు ఆయనకు దేవునిపై ఉన్న ప్రేమ గురించి ప్రస్తావించాను. ఈ రోజు నేను దాని గురించి మరిన్ని వివరాలను తెలియజేస్తాను.

తన యవ్వనంలో, ప్రవక్త పదవి లభించక ముందే, దేవునిపై ఆయనకున్న ప్రేమ ఎంతగా ఉండేదనగా ఆయన (స.అ.స.) పరవశించి హిరా గుహకు వెళ్లి తన దైవంతో ఏకాంత సంభాషణల్లో మునిగిపోయేవారు. దేవునిపై ఉన్న ఈ ప్రేమ గురించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వివరిస్తూ ఇట్లనిరి. అసలు విషయం ఏమిటంటే, ఒకసారి అల్లాహ్‌తో సాన్నిహిత్యం మరియు అనుబంధం ఏర్పడితే, అప్పుడు ప్రపంచం, ప్రాపంచిక వ్యక్తుల పట్ల విరక్తి, అసహ్యం కలుగుతుంది. సహజంగానే ఏకాంతం ఇష్టంగా మారుతుంది. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరిస్థితి కూడా ఇదే విధంగా ఉండేది. ఆయన (స.అ.స.) దేవుని ప్రేమలో ఎంతగా నిమగ్నమ య్యారంటే, ఆ ఏకాంతంలోనే పూర్తి ఆనందాన్ని, తృప్తిని పొందేవారు. ఎటువంటి సౌకర్యాలు లేని, వెళ్లడానికే భయం కలిగే అటువంటి ప్రదేశంలో ఆయన (స.అ.స.) ఎన్నో రాత్రులు ఒంటరిగా గడిపే వారు. దీని ద్వారా ఆయన (స.అ.స.) ఎంతటి ధైర్యవంతులో కూడా మనకు అర్థమవుతుంది. వాస్తవానికి దేవునితో సంబంధం బలంగా ఉన్నప్పుడు ధైర్యం కూడా వస్తుంది. అందుకే ఒక విశ్వాసి ఎప్పుడూ పిరికివాడిగా ఉండడు ప్రాపంచిక వ్యక్తులు పిరికివారుగా ఉంటారు, వారిలో నిజమైన ధైర్యం ఉండదు.

హుజూరె అన్వర్ హిరా గుహలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆరాధన గురించి హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారు ఉల్లేఖించిన హదీసును వివరంగా వివరించారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అల్లాహ్ తఆలా తన అనుగ్రహాన్ని ప్రయత్నం మరియు కష్టపడటంపై ఆధారపడి ఉంచాడని సూచించారు. ఇలాగే ఇందులో అనుచరుల రజియల్లాహు అన్హుమ్ ప్రవర్తన మనకు ఒక గొప్ప ఆదర్శం, ఉదాహరణ. అనుచరుల జీవితాల గురించి ఆలోచించండి!

కేవలం సాధారణ ప్రార్థనల ద్వారానే వారు ఆ ఉన్నత స్థానాలను పొందారా? లేదు, అల్లాహ్ తఆలా ఇష్టాన్ని పొందడానికి వారు తమ ప్రాణాలను కూడా లెక్కచేయలేదు, దేవుని మార్గంలో మేకలు, గొర్రెల వలె తమను తాము అర్పించుకున్నారు, అప్పుడే వారికి ఆ హోదా లభించింది.

వారు (అ) ఇంకా ఇలా అన్నారు, చాలామంది ప్రజలు ఒక ఊదుతోనే తాము ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, అల్లాహ్ సింహాసనం వరకు వెళ్లాలని కోరుకోవడాన్ని మేము చూశాము. మన పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కంటే గొప్పవారు ఎవరు ఉంటారు?. ఆయన  సల్లల్లాహు అలైహి వసల్లం మానవాళిలో శ్రేష్ఠులు, ప్రవక్తలందరిలోనూ ఉత్తములు, ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం గారే ఊదు ద్వారా అటువంటి పనులు చేయనప్పుడు, ఇక మరెవరు చేయగలరు?. చూడండి! ఆయన (స.అ.స.) హిరా గుహలో ఎటువంటి కఠోర సాధనలు చేశారు దేవునికే తెలుసు ఆయన (స.అ.స.) ఎంత కాలం విలపిస్తూ, రోదిస్తూ ప్రార్థనలు చేశారో, తన ఆత్మ శుద్ధి కోసం ఎంతటి కృషి మరియు కఠిన శ్రమ చేశారో, అప్పుడే అల్లాహ్ వైపు నుండి అనుగ్రహం కురిసింది.

అల్లాహ్ తఆలా ప్రేమలో ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ప్రార్థనల, ఆరాధనల నాణ్యత ఎలా ఉండేదో హుజూరె అన్వర్ ఇలా వివరించారు: ముతర్రిఫ్ (రజి) తన తండ్రి నుండి ఉల్లేఖించిన దాని ప్రకారం ఆయన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్లినప్పుడు ఆయన నమాజ్ చదువుతున్నారు. మరుగుతున్న పాత్రలో నుండి శబ్దం వచ్చినట్లు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం గుండె నుండి శబ్దం వస్తోంది. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఎంత తీవ్రంగా విలపిస్తూ, రోదిస్తూ ప్రార్థిస్తున్నారంటే పాత్రలో నీరు మరుగుతున్నట్లుగా ఉంది.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా కథనం ప్రకారం, ఆయన (స.అ.స.) ఎంతగా ఆరాధించేవారంటే, నమాజ్‌లో ఎక్కువ సేపు నిలబడటం వల్ల ఆయన పాదాలు వాచిపోయేవి.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రేమ, ఆరాధనల గురించి ప్రస్తావిస్తూ ఒక చోట ఇలా అన్నారు: హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇలా సెలవిచ్చారు, పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన మరణానికి ముందు తీవ్ర అనారోగ్యం పాలైనప్పుడు, బలహీనత వల్ల నమాజ్ చేయించే స్థితిలో లేనందున హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు ను నమాజ్ చేయించమని ఆదేశించారు. ఆ ఆదేశం ఇచ్చిన తర్వాత, ఆయన ఆరోగ్యం కొంచెం మెరుగుపడినట్లు అనిపించినప్పుడు, ఇద్దరు వ్యక్తుల సహాయంతో నమాజ్ కోసం బయటకు వచ్చారు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇంకా ఇలా అంటారు, ఆ సమయంలో నొప్పి తీవ్రత వల్ల ఆయన పాదాలు భూమిని తాకుతూ సాగిపోతున్న దృశ్యం నా కళ్ల ముందు ఉంది.

ఈ హదీసు ద్వారా మనకు ఏమి తెలుస్తుందనగా పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి ఎంత ప్రమాదకరమైన వ్యాధి ఉన్నా, ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం దేవుని స్మరణను

మరిచిపోలేదు. సాధారణంగా ప్రజలు కొంచెం ఇబ్బంది కలగగానే ఆరాధనలన్నీ మరిచిపోతారు. నిశ్చయంగా ఇది పైకి సాధారణంగా అనిపించవచ్చు, కానీ పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి స్థితిని చూడండి అనారోగ్యంలో కూడా దేవుని స్మరణ పట్ల ఆయనకున్న ఆరాటం ఎంతటిదంటే ఇద్దరు వ్యక్తుల భుజాలపై చేతులు వేసి నమాజ్ కోసం వచ్చారు. ఇది కేవలం సాధారణ విషయం కాదు, ఆయన హృదయంలో దేవుని స్మరణ పట్ల ఉన్న ఆరాటానికి ఇది ఒక అద్దం వంటిది.

దేవుని స్మరణే ఆయనకు ఆహారం అని, అది లేకుండా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తన జీవితంలో ఎటువంటి ఆనందాన్ని పొందలేరని విజ్ఞత గల ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవచ్చు. ఆయన (స.అ.స.) దీనినే ప్రస్తావిస్తూ, నాకు ఇష్టమైన విషయాలలో "నమాజ్ నా కళ్లకు చల్లదనం" అని అన్నారు.

హుజూరె అన్వర్ ఇలా అన్నారు: ప్రజలు మరియు నేటి తరం యువత తరచుగా అడిగే ప్రశ్న ఏమిటనగా సత్కార్యాలు అంటే ఏమిటి మరియు అల్లాహ్ తఆలా మనపై సంతోషంగా ఉన్నాడని మనకు ఎలా తెలుస్తుంది?. సత్కార్యాలు చేయడం మరియు అవి కేవలం అల్లాహ్ ఇష్టం కోసమే చేసినప్పుడు అతడు సంతోషిస్తాడు. ఒక మనిషి తనను తాను పరీక్షించుకోవచ్చు, దీని కోసం బయటి వ్యక్తి నిర్ణయం అవసరం లేదు. తాను చేస్తున్న సత్కార్యాలు కేవలం అల్లాహ్ కోసమే అయితే, అల్లాహ్ వాటిని ఖచ్చితంగా ఇష్టపడతాడని మనిషి స్వయంగా గ్రహించవచ్చు.

పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆరాధన నిరంతరంగా ఉండేది. ఆపై ఇంకా ఎక్కువ ఆరాటం కనిపించేది. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తన ప్రభువు ఆరాధనలో ఎంతగా మునిగి పోయేవారంటే, ప్రార్థనలు చేస్తూ చేస్తూ ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం పాదాలు ఎన్నోసార్లు వాచిపోయేవి. అనుచరులు ఇట్లు అడిగేవారు, ఓ అల్లాహ్ ప్రవక్త! మీకు ఇంతటి ఆరాధన అవసరం ఏమున్నది? మీ పాపాలు క్షమించబడ్డాయి కదా. దానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం "నేను దేవునికి కృతజ్ఞత గల దాసుడిగా ఉండకూడదా?" అని సమాధానం ఇచ్చేవారు. హుజూరె అన్వర్ ఇలా అన్నారు, అల్లాహ్! అది ఎటువంటి అభిమానం, ఎటువంటి ప్రేమ! దేవుని స్మరణలో నిలబడి నప్పుడు ఆయనకు తన శరీరంపై స్పృహ ఉండేది కాదు. ఇతరులను కలవరపరిచే ఆ నొప్పి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంపై ఎటువంటి ప్రభావాన్ని చూపేది కాదు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇచ్చిన ఆ సమాధానం ఎంతటి చిత్తశుద్ధిని, కృతజ్ఞతను ప్రతిబింబిస్తుందో కదా.

ఇదే క్రమంలో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన పనులలో ఎలా నిమగ్నమై ఉండేవారో వివరించారు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం కేవలం ఆరాధన మాత్రమే చేసి మిగిలిన పనులు వదిలేయలేదు. రోజంతా ఆయన (స.అ.స.) దేవుని నామ ప్రచారంలో, అతని విధేయతను పెంపొందించే ప్రయత్నంలో ఉండేవారు.

హుజూరె అన్వర్ ఇలా అన్నారు: కావున మనం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శాన్ని అనుసరిస్తూ నమాజ్, ఆరాధనలలో ఆ నాణ్యతను సాధించడానికి ప్రయత్నించాలి, అప్పుడే మనం నిజమైన ముస్లింలమని పిలవబడతాము.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం హజ్రత్ మీర్ నాసిర్ నవాబ్ గారికి రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు: మీరు తమ ఆచరణ కోసం అడిగిన విషయంనకు సమాధానం ఏమనగా పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన అనుసరణ వైపు మొగ్గు చూపండి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ పనుల పట్ల అత్యధికంగా తన ప్రేమను వ్యక్తం చేశారో అవి రెండు: ఒకటి నమాజ్ మరియు రెండవది జిహాద్ (ధార్మిక ఉన్నతి కోసం చేయబడే యుద్ధం). నమాజ్ గురించి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, నా కండ్ల చల్లదనం నిశ్చయంగా నమాజ్‌లోనే ఉంచబడింది.

వారు అలైహిస్సలాం ఇలా అన్నారు, ఈ కాలంలో జిహాద్ ఆధ్యాత్మిక రూపాన్ని సంతరించుకుంది మరియు ఈ రకమైన జిహాద్ ఏమిటంటే ఇస్లాం సందేశాన్ని చాటిచెప్పడానికి ప్రయత్నించడం. అల్లాహ్ తఆలా మరొక రూపాన్ని వెల్లడించే వరకు ఇదే జిహాద్.

హుజూరె అన్వర్ మనం దృష్టి వహించాలని సూచిస్తూ ఇట్లనిరి. ఒకవేళ మనం ఈ జిహాద్‌లో పాలుపంచుకోవాలనుకుంటే, మనం అల్లాహ్ తఆలా ప్రేమ, ప్రార్థనలు మరియు మన ఆరాధనల వైపు దృష్టి పెట్టాలని చెప్పారు. మనం ఆయన (స.అ.స.) ఆదర్శాన్ని అనుసరిస్తూ ఇలా చేస్తేనే మన పనులలో శుభం, అనుగ్రహం ఉంటుంది. అల్లాహ్ మనకు ఆ సామర్థ్యం ప్రసాదించుగాక.

చివరగా హుజూరె అన్వర్ ఇలా అన్నారు: ఈ రోజు బంగ్లాదేశ్ జమాఅత్ జల్సా జరుగుతోంది, అక్కడ వ్యతిరేకత చాలా ఎక్కువగా ఉంటుంది. అల్లాహ్ వారందరినీ తన రక్షణలో ఉంచాలని మరియు వారి జల్సా విజయవంతంగా ముగియాలని వారి కోసం ప్రార్థన చేయండి.

పాకిస్తాన్‌లోని అహ్మదీయుల కొరకు, పాకిస్తాన్‌తో పాటు అల్‌జజాయిర్‌లో దైవ మార్గంలో ఖైదీలుగా వున్న వారి విడుదల కొరకు, ప్రపంచ పరిస్థితులు మెరుగుపడుటకు కూడ దుఆలు చేయండి.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا
مَن يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ وَنَشْهَدُ أَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. عِبَادَ اللّٰه
رَحِمَكُمُ اللّٰهُ اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ يَعِظُكُمْ لَعَلَّكُمْ
تَذَكَّرُوْنَ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔

❀❀❀

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Telugu Desk)*